క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మోపాల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. మండలంలోని మంచిప్ప శివారులోగల ఓ ప్రయివేటు ఫాంహౌజ్‌లో గురువారం ఆయన కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. మంచిప్ప ప్రాజెక్ట్ పాత డిజైన్ ప్రకారమే పనులు జరిగే విధంగా చూడాలని గ్రామస్తులు ఆయనను కోరారు. అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓడిపోయామని కార్యకర్తలు అధైర్యపడొద్దని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ఉంటూ స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. మంచిప్ప సర్పంచ్ సిద్ధార్థ, ఉపసర్పంచి జగదీష్, నాయకులు నాయకులు మొచ్చ శ్రీనివాస్, కన్నీరాం, నరేష్, ముత్యంరెడ్డి, సాయిరెడ్డి, భరత్, గోకుల్ సింగ్, పరుశరాం,సాయిరెడ్డి, భూషణ్, రమేష్, మోహన్‌రెడ్డి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



జక్రాన్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న ముద్ర రుణాలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బ్రహ్మానందం సూచించారు. మండలంలోని చింతలూర్, కొలిప్యాక్ గ్రామాల్లో గురువారం ఆయన కేంద్రం ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు సుకన్య ప్రసాద్, గంగు బాలయ్య, ఉపసర్పంచ్ జలందర్, సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, హరిత శ్రీనివాస్, అధికారులు రవీందర్‌రెడ్డి, రవి, దేవిక, రాంబాబు పాల్గొన్నారు.

పార్లమెంట్ మార్చ్‌ను జయప్రదం చేయండి



నిజామాబాద్‌అర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జనవరి 12న నిర్వహించే పార్లమెంట్ మార్చ్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం అన్నారు. నగరంలోని సీపీఐ కార్యలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పార్లమెంట్ మార్చ్ నిర్వహించనున్నట్లు అన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపడుతున్నామన్నారు. సంఘ ప్రతినిధులు అంజలి, అంకిత, నవీన్, శివాజీ, నిశిత, రజిత్, వంశీ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం గ్రామంలో గురువారం నర్సరీని ఎంపీడీవో మల్లేష్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత నర్సరీలలో లక్ష్యం మేర మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. గుండారం నర్సరీలో వచ్చే 2024–25 సంవత్సరం నాటికి 10వేల మొక్కలను పెంచాలన్నారు. ఇప్పటికే అందులో 2వేల మొక్కలు అందుబాటులో ఉన్నయన్నారు. కార్యదర్శి సుదాకర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, గ్రామ పంచాతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖలో క్రిస్మస్ వేడుకలు



నిజామాబాద్‌నాగారం: నూతన కలెక్టరేట్ ఆవరణలో ఉన్న వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సపోస్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సుదర్శనం కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల నిరసన

- ఉపరాష్ట్రపతిని విపక్షాలు అవహేళన చేయడంపై ఆగ్రహం
- క్షమాపణ చెప్పాలని డిమాండ్



నగరంలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్/సిరికొండ/ధర్పల్లి/ఇందల్వాయి: దేశ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్‌ఖడ్‌పై పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు అవహేళన చేయడం సరికాదని, తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా బీజేపీ నాయకులు తెలిపారు. ఈ ఘటనపై వెంటనే రాహుల్‌గాంధీ, కల్యాణ్ బెనర్జీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఈమేరకు నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో గురువారం బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. రాజ్యసభ చైర్మన్‌ను ఉద్దేశించి మిమిక్రీ చేస్తూ అవహేళన చేయడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనను పక్కనే ఉన్న రాహుల్‌గాంధీ చిత్రీకరించడం ఆయనకున్న రాజకీయ పరిపక్వతకు నిదర్శనమన్నారు. ప్రజాప్రతినిధులకు భావ ప్రకటన స్వేచ్ఛ ఉందని, కానీ వ్యక్తిగతంగా దూషించడం తగదని, రాజకీయాల్లో హుందాగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్, ఇతర పార్టీలు రాజకీయ మనుగడ కోసం పార్లమెంట్‌లో చర్చ జరగకుండా అడ్డుకోవడం సరికాదని, కీలకమైన బిల్లులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఈ చర్యను యావత్ దేశం ఖండిస్తోందని, వెంటనే జగదీప్ ధన్కర్‌కు వారు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌చేశారు. రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో గురువారం బీజేపీ నాయకులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. నాయకులు సందగిరి రాజశేఖర్ రెడ్డి, దొంతుల రవి, భరత్ భూషణ్, ఇప్పకాయల కిషోర్, శీల శ్రీనివాస్, గడ్డం రాజు, పుట్ట వీరేందర్, సుక్క మధు, ఆకుల శ్రీనివాస్, బాలకృష్ణ, ఆశిష్, హరీష్‌రెడ్డి, కిషన్, అంబదాస్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, లింబాద్రి, బాపురావు, సంజీవ్‌రెడ్డి, రవి, గోపి, గంగారెడ్డి, మహిపాల్, నరేష్‌గౌడ్, శ్రీకాంత్, రాజు, రాజన్న, చిన్ను, అశోక్ పాల్గొన్నారు.



సిరికొండ మండల కేంద్రంలో..



ధర్పల్లిలో..



ఇందల్వాయిలో..

జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న విజయ్ స్కూల్ యాజమాన్యం



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న 'క్యూరియస్ అకాడమీ' మాస్టర్స్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని విజయ్ హైస్కూల్ విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా గురువారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులు హరిణియాదవ్, జాహ్నవియాదవ్, మధుశ్రీలను స్కూల్ వ్యవస్థాపకురాలు అమృతలత అభినందించారు. అలాగే నగరంలోని క్యూరియస్ తైక్వాండో అకాడమీ చెందిన క్రీడాకారులు జిల్లా స్థాయి ఎంపికల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకుకి ఎంపికయ్యారు. క్రీడాకారులను మాస్టర్స్ వినోద్‌నాయక్ అభినందించారు. డిసెంబర్ 21నుంచి 23 వరకు తాండూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొనున్నారు.

సిరికొండ: రాష్ట్రస్థాయి హకీ పోటీల్లో సిరికొండ ప్రభుత్వ ఆదర్శ కళాశాల విద్యార్థిని శ్రీనిధి ప్రతిభ కనబర్చి మూడో స్థానంలో నిలిచినట్లు పీడీ కిషన్ తెలిపారు. విద్యార్థినిని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వందన, ఉపాధ్యాయులు గంగాప్రసాద్ అభినందించారు.

సంక్షిప్తం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి



మహమూద్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఉమ్మడి నిజామాబాద్ మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు మహమూద్ (55) గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందాడు. శుక్రవారం మంచిప్పలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు.

రక్తదానం



తెయూ(డిచ్‌పల్లి): ఏపీ సీఎం జగన్ జన్మదినం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో తెలంగాణ యూనివర్సిటీ వైస్సార్‌సీపీ విద్యార్థి నాయకుడు జక్కుల కరుణాకర్ రక్తదానం చేశారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాల, ప్రతిభ హైస్కూల్‌లో గురువారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నర్సయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస ఇతర పోటీలను నిర్వహించారు.

డీజీపీని కలిసిన వ్యాపారులు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యాపారులు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు దర్శన్ సింగ్ సోకి గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ రవి గుప్తాను మర్యాద పూర్వకంగా కలిశారు. డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డీజీపీకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. డీజీపీను కలిసిన వారిలో వ్యాపారులు దేవేందర్ సింగ్, బల్విందర్ సింగ్‌లు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్)/ఖలీల్‌వాడి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల విద్యాసంస్థలలో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సుద్దపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి ఒక ప్రకటనలో కోరారు. అలాగే నగరంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రాగలత సైతం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవటానికి అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు స్థానిక గురుకుల పాఠశాల/కళాశాలను సందర్శించాలని సూచించారు.

కరోనాపై అవగాహన

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని బర్కత్‌పుర పాఠశాలలో గురువారం కరోన వైరస్‌పై అవగాహన నిర్వహించారు. హెచ్ఎం కృపాల్ సింగ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, మాస్కులు ధరించాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని కోటగల్లికి చెందిన నిరుపేద వృద్ధురాలు వల్లకాటి సుభద్ర బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. మృతిరాలికి భర్త తప్ప కుటుంబసభ్యులు లేకపోవడంతో కాలనీవాసులకు అంత్యక్రియల ఖర్చు కోసం గురువారం శ్రీ లక్ష్మీచేయూత సేవా సమితి సభ్యులు రూ.5వేలు అందజేశారు. అధ్యక్షుడు వంగల రమణాచారి, తాటి శ్యామ్‌కుమార్ ఉన్నారు.

నేడు జక్రాన్‌పల్లిలో 'ఉషా పవనాలు' పుస్తకావిష్కరణ

జక్రాన్‌పల్లి: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రముఖ రచయిత్రి శ్రీమతి గోర్తీ ఈశ్వర ట్రస్ట్ ఉషబాల రాసిన 'ఉషా పవనాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు గోర్తీ ఈశ్వర ట్రస్ట్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి వీపీఎస్ విద్యా సంస్థల అధిపతి, కవి, రచయిత డాక్టర్ అమృతలత, ప్రముఖ సంఘ సంస్కర్త సామాజిక సేవకులు, లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు పైపుల రాజిరెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

నందిపేటకు అయోధ్య రామయ్య అక్షింతలు

నందిపేట్ (ఆర్మూర్): అయోధ్యలో శ్రీరాముని విగ్రహప్రతిష్ఠాపనను పురస్కరించుకొని పంపిణీ చేసిన అక్షింతలు గురువారం నందిపేట మండల కేంద్రానికి చేరాయి. కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు గడపగడపకు అక్షింతలను పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. అక్షింతల తోపాటు కరపత్రాలు, హనుమాన్ చాలీసా పత్రాలు వచ్చాయన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఎల్లమ్మగుట్ట రత్నాల కల్లం హనుమాన్ మందిరంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా గురువారం రెండోరోజు ఆలయంలో ప్రతిష్ఠించే దేవుళ్ల నూతన విగ్రహాలకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి విద్యా రణ్యా భారతి ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రవచనాలు వినిపించారు. శుక్రవారం నూతన విగ్రహాలను గర్భగుడిలో విద్యారణ్యా భారతిస్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించనున్నారు. న్యాలంరాజు, ఒడ్డెపు ప్రభాకర్, రాంపురం సురేష్, కళ్యాణ్ మిట్టు, శ్రీనివాస్, రవి, నాగేంధర్, అబ్బయ్య, వెంకటేష్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో..



ధర్పల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో విగ్రహ స్థాపన, ధ్వజస్తంభం, హోమం లాంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మిట్టపల్లి ప్రవీణ్, రంజిత్ రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



జక్రాన్‌పల్లి: మండలంలోని నల్లగుట్ట తండాలో గురువారం జగదాంబ దేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయరెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. మునిపల్లి సర్పంచ్ సాయరెడ్డి, బంజారా భేరి జిల్లా అధ్యక్షుడు సంతోష్‌నాయక్, వీడీసీ సభ్యులు పీర్ సింగ్, రవి, నరేష్, దుబాయ్ శ్రీనివాస్, గోపాల్, శ్రీను,దశరథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో గురువారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలిగా మడా స్వప్న, జిల్లా సెక్రెటరీగా చింతకాయల రాజేష్, జిల్లా జాయింట్ సెక్రెటరీలుగా గోపరి లక్ష్మణ్, శివకుమార్, పాక సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేందర్, పట్టణ అధ్యక్షుడిగా ధాత్రిక రతన్, ఆర్గనైజర్ సెక్రెటరీగా కృష్ణ ప్రసాద్, పట్టణ సెక్రెటరీగా కుర్లం శివ, పట్టణ జనరల్ సెక్రెటరీగా పిట్టల కృష్ణ, స్టూడెంట్ యూనియన్ సెక్రెటరీగా చైతన్య కృష్ణ ఎన్నికయ్యారు. అనంతరం రాష్ట్ర సెక్రెటరీ సుజీత్ ఠాకూర్, రాష్ట్ర కన్వీనర్ పోతన్కర్ లక్ష్మీ నారాయణ, జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, రాష్ట్ర ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి రేవంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌కిషన్ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, లక్ష్మణ్‌రావు, వినోద్, సాయగౌడ్, అమడ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పార్కులను పరిశుభ్రంగా ఉంచాలి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పార్కులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా ఏర్పాటు చేయాలని అధికారులను మేయర్ నీతూకిరణ్ ఆదేశించారు. నగరంలోని 6వ డివిజన్ అమరుల పార్క్, న్యూ ఎన్జీవోస్ కాలనీలోని పంచతత్వ పార్క్, 22వ డివిజన్‌లోని బస్వా గార్డెన్ వెనకాల గల పార్కులను గురువారం ఆమె మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. పార్కులలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను పరిశీలించి ఉపయోగంలో లేని పరికరాలను త్వరితగతిన మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఉల్లాసం ఉండటానికి ప్రతి ఒక డివిజన్‌లో ఒక పార్క్ ఉండే విధంగా ప్రణాళికలు రచించి ఏర్పాటు చేశామని, అందులో పిల్లలు ఆదుకుండేందుకు వీలుగా ఆట వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు పార్కులను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్పొరేటర్ ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ ఇంజినీర్ సల్మాన్ ఖాన్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్‌గౌడ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తెయూ హెల్త్ సెంటర్ సమస్యలు పరిష్కరించాలి



క్యాంపస్ హెల్త్ సెంటర్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో హెల్త్ కేర్ సమస్యలు పరిష్కరించాలని వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం హెల్త్ సెంటర్ ఎదుట వారు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. హెల్త్ సెంటర్ సక్రమంగా తెరవడం లేదని, సిబ్బంది రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే కొన్ని రకాల రోగాలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం లేదని, అత్యవసరం వస్తే నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లి, చూయించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి హెల్త్ సెంటర్ సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు ప్రిన్స్, మోహిత్, శివ సాయి, రవీందర్, ఆకాష్, అక్షయ్, హన్మాండ్లు, గంగులీ, నర్సింలు, యశ్వంత్, సాయిరాం పాల్గొన్నారు.

హాస్టల్ మెస్ బిల్లులపై విచారణ జరిపించాలి..



తెయూ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బాలుర, బాలికల హాస్టల్స్ మెస్ బిల్లులపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని వర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం తెయూ చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థులపై మెస్‌చార్జీల పేరిట అధిక భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వర్సిటీ హాస్టల్లో వైఫై సరిగా రావడం లేదని, విద్యార్థుల సౌకర్యార్థం సెల్ టవర్‌ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. నాయకులు చిత్రు, సహాయ కార్యదర్శి పవన్, విక్రమ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రామాలయంలో తిరుప్పావై ప్రవచనములు

నిజామాబాద్ సిటీ: నగరంలోని వైష్ణవ ఆలయాలలో ధనుర్మాసం సందర్భంగా తిరుప్పావై ప్రవచనములు కొనసాగుతున్నాయి. సుభాష్‌నగర్ రామాలయంలో నిత్యం తిరుమల తిరుపతి దేవస్థానముల ఆళ్వారుదివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనములు శ్రీ మాన్ ఉభయవేదాంత ప్రవర్తక దైవజ్ఞ సముద్రాల శ్రీధరాచార్యులు చేశారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	26	గాజరుగడ్డ	40	60
బెండకాయ	60	90	పచ్చిమిర్చి	50	75
జీరకాయ	60	90	దోసకాయ	20	40
దొండకాయ	45	75	ఆలుగడ్డ	16	35
జిర్నినుకాయ	50	80	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	40	60	కరివేపాకు	60	80
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,750	వెండి (కిలో)	77,500
22 క్యారెట్స్	57,858		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-2: సలార్(తెలుగు)-8.20; అక్వామెన్ (ఇంగ్లీష్-3డీ)-12.25; డుంకీ(హిందీ)-3.30 10.30; హాయ్ నాన్న(తెలుగు)-7.00
- స్క్రీన్-3: సలార్(తెలుగు)- 8.00,11.30, 3.00, 6.45, 10.15

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: సలార్(తెలుగు)-8.00,11.35, 3.10, 6.45, 10.20
- స్క్రీన్-2: సలార్(తెలుగు)-8.30,12.05, 3.40,7.15, 10.50
- స్క్రీన్-3: సలార్(తెలుగు)-6.40,11.00; అక్వామెన్(ఇంగ్లీష్-3డీ)-10.15,8.15; హాయ్ నాన్న(తెలుగు)-1.00; యానిమల్(తెలుగు)-4.15
- స్క్రీన్-4: డుంకీ(హిందీ)-9.20,12.40,4.00, 7.20,10.40

- దేవి: సలార్(తెలుగు)
- నటరాజ్: యానిమల్(హిందీ)
- లలితామహల్: సలార్(తెలుగు)
- విజయ్: సలార్(తెలుగు)